## నిరుపేద విద్యార్థికి కలెక్టర్ చేయూత

లాప్‌ట్యాప్ అందజేస్తున్న కలెక్టర్,అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 26: నిరుపేద విద్యార్థికి కలెక్టర్ మను చౌదరి చేయూతనందించారు. సిద్దిపేట జిల్లాలోని కోహెడ మండలం నకిరెమ్ముల గ్రామానికి చెందిన బి ఆర్యన్ రోషన్ గురుకుల పాఠశాల కోహెడలో చదివి 10వ తరగతిలో 10/10 జీపీని సాధించాడు. అదే విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదివి ఐఐటీ తిరుపతిలో కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో సీట్ సాధించిన అతడికి ఐఐటీలో చేరేందుకు పేదరికం అడ్డు రావడంతో స్పందించిన కలెక్టర్ చదువుకునేందుకు తోడ్పాటునందిస్తానన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో 40,500 విలువ గల హెచ్‌పీ లాప్ టాప్‌తో పాలు ఐఐటీ ఫస్ట్ సెమిస్టర్ ఫీజు రూ.36,750 లను చెక్కు రూపేనా జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ఆర్యన్ రోషన్‌కి అందజేశారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలి

సిద్దిపేట అర్బన్, జూలై 26 : సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో జాగ్రత్తలు పహించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్‌తో కలిసి పర్యటించిన, అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మండల స్థాయిలో ఉన్న వైద్యులను ఉద్దేశించి మాట్లాడారు వైద్య సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఫీవరు సర్వే నిర్వహించాలని జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి, పరీక్షలను నిర్వహించి తగిన చికిత్స అందించాలని సూచించారు.

## విద్యా రంగాన్ని విస్మరించిన కాంగ్రెస్ సర్కారు

చేర్యాల, జూలై 26 : విద్యా రంగానికి బడ్జెట్‌లో కేవలం 7.3 శాతం నిధులు కేటాయించిన కాంగ్రెస్ సర్కారు విద్యార్థి లోకం బుద్ధి చెప్పాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి కోరారు. విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వం కేవలం 7.3 శాతం నిధులు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించుకొని 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. నాయకులు తాడూరి భరత్ కుమార్, మైసంపల్లి రాహుల్, ప్రశాంత్, రంజిత్, రాజు, రవి, రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రూ. 8 ఇస్తే ఏం తినమంటారు..

సిద్దిపేట టౌన్, జూలై 26 :బయట భోజనం చేయాలంటే కనీసం వందపాయలైనా కావాలి.. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం ఒక విద్యార్థికి రోజుకు 8 రూపాయలను మాత్రమే ఖర్చు పెడుతున్నది.. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతో ఏమీ తినమాంటారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని యూఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్లాపురం మధు ప్రశ్నించారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థి సంఘం నేతలు వినయ్, ర వి, శ్రావణ్,మహేశ్ పాల్గొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన ఎమ్మెల్యే పల్లా

మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

చేర్యాల, జూలై 26 : కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా శుక్రవారం మేడిగడ్డ బ్యారేజీని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సందర్శించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మేటిగడ్డ బ్యారేజీని సందర్శించిన అనంతరం స్థానికులు ప్రకటన విడుదల చేశారు. మేడిగడ్డపై అధికార కాంగ్రెస్ చేసిన విషప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

## 50 శాతం పీఆర్సీ ప్రకటించాలి

చేర్యాల, జూలై 26 : ప్రతి ఐదేండ్లకు ఒక సారి ఉపాధ్యాయులకు ప్రకటించే పీఆర్సీ ఉపాధ్యాయు, ఉద్యోగుల జీవన ప్రమాణాలకు ముడిపడి ఉంటుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశీధర్‌శర్మ అన్నారు. సభ్యత్వ పక్షోత్సవంలో భాగంగా చేర్యాల మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీఎన్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయాలని, సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వదరాజులు, ఆశ లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, పెరిక రాజ య్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మారెడ్డి, శ్రీనివాస్, మద్దూరు మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

## ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్య

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 26 : ప్రేమించిన యువకుడు పెండ్లికి నిరాకరించడంతో యువతి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ విషమించి శుక్రవారం మృతి చెందిన సంఘటన త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలంలోని బందారానికి చెందిన యువతి (24), అదే మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన మంతూరు నితీశ్ సిద్దిపేటలో ఒకే కళాశాలలో చదువుకుంటున్న క్రమంలో ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఇంటర్ తర్వాత యువతి డిగ్రీ కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. హైదరాబాద్‌లో చదువు ముగించుకొని బందారం వచ్చిన యువతి నితీశ్‌తో ప్రేమను కొనసాగించింది. పెళ్లి చేసుకోవాలని యువకుడిని సదరు యువతి కోరింది. మన ఇద్దరి కులం వేరు అని మాఇంట్లో ఒప్పుకోరన్నాడు. దీంతో యువతి తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా, యువతిని పెళ్లి చేసుకోనని నితీశ్‌చెప్పాడు. దీంతో ఈ నెల 10న యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా, కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు.

## చికిత్స పొందుతూ విషమించి యువకుడు మృతి

దుబ్బాక,జూలై26 : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన ఓ క్షతగాత్రుడు దవాఖానలో చికిత్స పొందుతూ విషమించి మృతి చెందాడు. ఈ సంఘటనపై దుబ్బాక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట మండలం రావురుకుల గ్రామానికి చెందిన బట్టు కనకయ్య (50) గొర్రెల కాపరి. గురువారం ఉదయం బైక్‌పై దుబ్బాకలోని బంధువుల వద్దకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామ శివారులో (దుబ్బాక –సిద్దిపేట రోడ్డులో) కనకయ్య మోటరు సైకిల్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మొదట సిద్దిపేట దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సమాచారం మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాజు తెలిపారు.

## మల్లన్నసాగర్ నిర్వాసితుల పక్షాన ప్రకటన చేయాలి

గజ్వేల్, జూలై 26 : అసెంబ్లీ సమావేశాల్లో మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల పక్షాన బడ్జెట్‌లో నిధులు కేటాయించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంతో అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయని, చాలా మందికి ప్యాకేజీలు రావాల్సి ఉందని, నిర్మించిన కాలనీలో సౌకర్యాలు కల్పించాలన్నారు. రేవంత్‌రెడ్డి ముంపు గ్రామాల పక్షాన గతంలో ఏటిగడ్డకిష్టాపూర్‌లో దీక్ష చేసి అన్యాయం జరిగిందని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు స్వయంగా అతనే నిర్ణయం తీసుకునే విధంగా సీఎం హోదాలో ఉన్నరన్నారు. వెంటనే బడ్జెట్‌లో నిధులు కేటా యిస్తున్నట్లు ప్రకటన చేయాలన్నారు.

## మహిళలు అభివృద్ధి చెందాలి

### శక్తిగా ఎదగాలి

గజ్వేల్, జూలై 26: మహిళలు వ్యాపారరంగంలో అభివృద్ధిలోకి వచ్చేలా రుణాలను అందజేస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హనుమంతరెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్‌లో నిర్వహించిన మహిళ శక్తి కార్యక్రమంలో అవగాహన కల్పించారు మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ నర్సయ్య, మెప్మా అధికారిణి సరిత పాల్గొన్నారు.

సిద్దిపేట టౌన్,జూలై 26 : మహిళలు శక్తిగా ఎదగాలని సిద్దిపేట మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గా అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ముందడుగు ఆదర్శ మహిళ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. మహిళలకు, బాలికలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే షీటీం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య, మాధవి,భాగ్యలక్ష్మి, స్వరూప, రజిత, నేలమ్మ, శ్వేత సుజాత తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట : బడ్జెట్లో సిద్దిపేటకు కేటాయింపులు ఏమీ లేవని నిరసిస్తూ గాడిద గుడ్డు ప్లెక్సీతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

దుబ్బాక : రాష్ట్ర బడ్జెట్‌పై నిరసనగా దుబ్బాకలో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

హుస్నాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

## మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్

**గురువారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను పూర్తిగా విస్మరించిందని బీజేపీ ఆరోపించింది. బడ్జెట్ కేటాయింపులను నిరసిస్తూ శుక్రవారం జిల్లావ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎగొట్టేలా బడ్జెట్ ఉందని బీజేపీ నాయకులు విమర్శించారు .**

*-సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, జూలై 26*

కొమురవెల్లిలో కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఫ్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

## నిరాశపర్చిన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, జూలై 26: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి గుండు సున్నా నిస్తే.. రాష్ట్ర బడ్జెట్ ఆరు గ్యారెంటీలకు వారంటీ లేకుంటా ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మెరుగు మహేశ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు భూక్య భిక్షపతి నాయక్, దరిపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు రెడ్డి యాదగిరిలతో కలిసి మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లకు అరకొరగా నిధు లు కేటాయించారన్నారు.

### అబద్దాల పునునాదులపై గద్దెనెక్కిన కాంగ్రెస్

హుస్నాబాద్, జూలై 26 : ఎన్నికలకు ముందు అలవిగాని హామీలు ఇచ్చి అబద్దాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి సుద్దాల చంద్రయ్య అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్, విద్యార్థి యువజన నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేస్తున్న కేంద్రం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, జూలై 26 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో రాష్ట్ర ప్రజలను జరిగేది శూన్యమని వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, బీఆర్ఎస్ నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతు భరోసా, మహిళా భృతి, పించన్లపెంపుపై బడ్జెట్ నిధులకు కేటాయించక పోవడం శోచనీయమన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, నాయకులు సల్లూరి మల్లేశం తదితరులు ఉన్నారు.

## అంకెల గారెడీగా రాష్ట్ర బడ్జెట్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి

తొగుట జూలై 26 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అంకెల గారెడీగా ఉందని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. తొగుటలో మాట్లాడుతూ ఈ ప్రభుత్వ మొదటి బడ్జెట్ దశ దిశ లేకుండా ఉందని, ఇది రాష్ట్రాన్ని తిరోగమన దిశలో నడిపే బడ్జెట్ అని పేర్కొన్నారు. సమావేశంలో మండల యూత్ అధ్యక్షుడు మాదాసు అరుణ్ కుమార్,నాయకులు సూతారి రమేశ్, రాములు, రాంబాబు, ఎంగలి రాజు తదితరులు ఉన్నారు.

## దళిత గిరిజనుల సమగ్రాభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలి

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్, జూలై 26: అసెంబ్లీలో దళిత, గిరిజనుల అభివృద్ధిపై చర్చించాలని కోరుతూ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌కు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోఎస్సీల జనాభా ప్రకారం నిధుల కేటాయించాలని ఎన్నికల్లో హామీ ఇచ్చిన అంబేద్కర్ అభయ హస్తం తదితర పథకాలు అమలు కోసం అసెంబ్లీలో చర్చించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేకాభివృద్ధి నిధుల కేటాయింపు చట్టం 2017 ప్రకారం దళిత జనాభా 18శాతం ప్రకారం నిధులు కేటాయించాలన్నారు. దళితులు, గిరిజనుల సంక్షేమం అభివృద్ధి రక్షణలను అమలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించాలన్నారు.

### ముదిరాజ్‌లకు ప్రభుత్వం కృషి చేయాలి

మిరుదొడ్డి, జూలై 26 : ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనకుబడిన ముదిరాజ్ కులస్తుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు ఐల విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం తహసీల్‌లో ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని వినతి పత్రం అందజేశారు.

## ట్రస్మా ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్

సిద్దిపేట పట్టణంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సిద్దిపేట, జూలై 26 : దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికుల పోరాటం మనందరికి స్ఫూర్తిదాయకమని డీసీపీ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో ట్రస్మా ఆధ్వర్యంలో 3500 మంది విద్యార్థులతో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని బీజేఆర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి, ఎసీ పీ మధు, ట్రస్మ ప్రతినిధులు భగవాన్‌రెడ్డి, శ్రీకాంత్, సత్యం, సంపత్ కుమార్, రమేశ్, వెంకటేశ్, సంతోశ్ కుమార్, ఎజాస్ అలీ సునైనా, దాస్ పాల్గొన్నారు.

### జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్ జూలై 26 : మండల కేంద్రంలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు.

### కొవ్వొతులతో నివాళి

హుస్నాబాద్, జూలై 26: హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో పట్టణ ఆర్యవైశ్య సంఘం, బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కార్గిల్ అమరవీరులకు కొవ్వొత్తులో నివాళులర్పించారు. నాయకులు చిట్టి గోపాల్‌రెడ్డి, లక్కిరెడ్డి తిరుమల, కొత్తపల్లి అశోక్, రాగి కవిత, నాగరాజు, కవ్వ జైపాల్‌రెడ్డి, వెంకటేశం, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### విజేతలకు బహుమతుల ప్రదానం

బెజ్జంకి, జూలై 26 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ దివస్ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నారోజు శంకరాచారి, కార్యదర్శి బెజుగం విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గజ్వేల్‌లో..

గజ్వేల్, జూలై 26: కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్గిల్ యుద్ధం ముగిసి నేటికి 25 ఏండ్లు పూర్తయ్యిందని గుర్తు చేసుకున్నారు. ప్రిన్సిపల్ గణపతిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రత పాటించాలి

సిద్దిపేట : నీటి కుండీలో నుంచి నీటిని తొలిగిస్తున్న మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్

హుస్నాబాద్‌టౌన్, జూలై 26 : పనికిరాని వస్తువుల్లో నిలిచిన వర్షపునీటిలో దోమలు పెరుగుతున్నా పట్టించుకోకపోవడం ఏమిటని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న పలువురిని ప్రశ్నించారు. అప్లాబీమారి భగాలలో భాగంగా పట్టణంలోని 9వ వార్డులో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్ మ్యాదరబోయిన శ్రీనివాస్, వనమహోత్సవ సూపర్‌వైజర్ జాలిగాం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవి కుమార్ ఉన్నారు.

### పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చేర్యాల, జూలై 26 : పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి శ్రీధర్‌రెడ్డి అన్నారు. 3,12 వార్డుల్లో నివాస గృహా ల్లో కుండీల్లో నిల్వ ఉన్ననీటిని తొలిగింపచేశారు.

### సిద్దిపేటలో..

సిద్దిపేట, జూలై 26 : వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి అన్నారు. 28వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ మల్లికార్జున్‌తో కలిసి పర్యటించారు. ఇంటి పరిసరాల్లో నీటి కుండీల్లో నీరు నిల్వ ఉండడం గమనించి నీటిని తొలిగింపజేశారు.

### అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్, జూలై 26: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి నీటి నిల్వలను తొలపగింపజేశారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

వర్గల్, జూలై 26 : సమాజంలో మహిళల భద్రత కోసం పోలీసు వ్యవస్థఎంతగానో కృషి చేస్తున్నదని గౌరారం ఎస్సై శివ కుమార్ తెలిపారు. శుక్రవారం వర్గల్ మండలం తున్కిఖల్సా ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో ఫోక్సో చట్టం, యాంటి ఉమెన్స్ ట్రాఫికింగ్ తదితర సైబర్ నేరాలపై షీటీమ్స్ బృందం అధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలను ఎవరైనా వేధిస్తే 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్స్ బృందం అధికారులు, హెచ్.ఎం అనిత, ఏఎస్సై మధు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### అక్కన్నపేటలో..

అక్కన్నపేట, జూలై 26 : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అక్కన్నపేట ఎస్సై విజయభాస్కర్ సూచించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్సై సమావేశం నిర్వహించి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి, పలు గ్రామాల ఫిర్యాదుదారులు ఉన్నారు.

## పంట రుణాల రెన్యువల్‌కు బ్యాంక్ కొర్రీలు

**ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు**

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 26 : రాష్ట్ర ప్రభుత్వం లక్షలోపు రుణాలను మాఫీ చేసిన క్రమంలో రైతుల పంట రుణాలను రెన్యూవల్ చేసే సమయంలో బాంక్ అధికారులు పలు కొర్రీలు పెడుతున్నారు. రెన్యూవల్ కావాలంటే కొంత అమౌంట్‌ను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాల్సిందేనని తెగేసి చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూర్తి వివరాలలోకి వెళ్లితే.. మద్దూరు మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ)లో పంట రుణాలు మాఫీ అయిన రైతులకు బ్యాంక్ అధికారులు తిరిగి రుణాలను రెన్యూవల్ చేస్తున్నారు. ఈ సమయంలో మంజూరైన రుణంలో కొంత భాగా న్ని బ్యాంక్ అధికారులు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు చేసుకుంటున్నారు. పంట రుణమాఫీ అయితే తిరిగి పంట రుణాలను పొందవచ్చునని ఆశపడ్డ రైతులను బ్యాంక్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనికితోడు రెన్యూవల్‌కు వివిధ రకాల రుణాలకు ముడిపెట్టి తమ ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ అధికారులు తమకు మంజూరైన రుణాలను నేరుగా తమకే అందజేయాలని డిపాజిట్‌ల పేర ఇబ్బందులకు గురి చేయవద్దని మద్దూరు మండలంలోని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఏపీజీవీబీ బ్యాం క్ మేనేజర్ హరిప్రసాద్‌ను వివరణ కోరగా, బ్యాంక్ రన్ కావాలంటే డిపాజిట్లు అవసరమే కదా అందుచేత డిపాజిట్‌లను తీసుకుంటున్నట్లు తెలిపారు.

## పానుగంటి తిరుపతయ్యకు 'బంగారు ఐరావతం' అవార్డు

అవార్డును అందుకుంటున్న అర్చకుడు తిరుపతయ్య

మద్దూరు (ధూళిమిట్ట), జూలై 26 : మద్దూరు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి, రామాలయాల అర్చకుడు పానుగంటి తిరుపతయ్య శుక్రవారం బంగారు ఐరావతం అవార్డును అందుకున్నారు. గురుపూజోత్సవంలో భాగంగా శ్రీ ప్రగతి పౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా అందజేసే అవార్డును హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, పలువురు సినీనటులు తిరుపతయ్య జ్యోతిష్య, అర్చక రత్నాకరం బిరుదుతో పాటు బంగారు ఐరావతం అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ తనకు అవార్డు అందజేసిన ప్రగతి ఫౌండేషన్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వివరించారు. కాగా బంగారు ఐరావతం అవార్డును అందుకున్న తిరుపతయ్యను, పండితులు, గ్రామస్తులు అభినందించారు.

## మర్కూక్ తహసీల్దార్‌గా ఆరీఫా

మర్కూక్, జూలై 26 : మర్కూక్ మండల తహసీల్దార్‌గా ఆరీఫా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన చంద్రశేఖర్‌రావు బదిలీల్లో భాగంగా గజ్వేల్ డీఏవోగా వెళ్లారు. అక్కడ డీఏవోగా పనిచేసిన ఆరీఫా మర్కూక్ తహసీల్దార్‌గా వచ్చా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే తహసీల్దార్ ఆఫీసుకు వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

## జీవాలపై హైనా దాడి

మద్దూరు (ధూళిమిట్ట), జూలై 26 : హైనా దాడిలో జీవాలు మృత్యువాత పడిన సంఘటన మద్దూరు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మ